సాక్షి
అనంతపురం
సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



రైల్వేస్టేషన్లకు మహర్దశ

బ్రిటీష్ కాలంలో నిర్మించిన జిల్లాలోని రైల్వేస్టేషన్ల రూపురేఖలు సమూలంగా మారిపోనున్నాయి.

8లో



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి



జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రైతులకు శుభవార్త

- నున్నా వడ్డీ కింద రూ.17.25 కోట్లు మంజూరు



అనంతపురం అగ్రికల్చర్: వైఎస్సార్ పంట రుణాల సున్నా వడ్డీ పథకం కింద జిల్లాలో 83,314 మందికి రూ.17.25 కోట్లకు పైగా మంజూరైనట్లు వ్యవసాయశాఖ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఈ నెల 28న 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' కింద 2.94 లక్షల మందికి రూ.58.80 కోట్ల పెట్టుబడి సాయంతో పాటు సున్నావడ్డీ సొమ్మును కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేయనున్నారు. రబీ–2021కు సంబంధించి 18,814 మంది రైతులకు రూ.2.13 కోట్లు, ఖరీఫ్–2022కు సంబంధించి 65,420 మంది రైతులకు రూ.15.12 కోట్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. పంట రుణాల కింద బ్యాంకుల్లో రూ.లక్ష లోపు తీసుకున్న రైతులకు సున్నావడ్డీ వర్తింపజేసినట్లు తెలిపారు.

త్వరలో భవిష్యత్తు కార్యాచరణ

- చంద్రబాబు తీరుపై ఉన్నం అసహనం



ఉన్నం క్యాంప్ కార్యాలయంలో సమావేశమైన అనుచరులు

కళ్యాణదుర్గం: త్వరలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ వెల్లడిస్తామని నియోజకవర్గ టీడీపీ నేత ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఆయన కుమారుడు ఉన్నం మారుతీ చౌదరి స్పష్టం చేశారు. సీనియర్ అయిన హనుమంతరాయ చౌదరిని విస్మరించి పార్టీ టికెట్‌ను కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్ర బాబుకు చంద్రబాబు కేటాయించిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే ఉన్నం, ఆయన అనుచరులు బహిరంగంగానే నిరసన తెలిపారు. ఈ క్రమంలోనే పట్టణంలోని ఉన్నం మారుతి చౌదరి క్యాంపు కార్యాలయంలో ఆదివారం తమ అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరితో పాటు ఆయన కుమారుడు ఉన్నం మారుతీ చౌదరి మాట్లాడారు. ఎంతో మంది ఎక్కడి నుంచో వస్తుంటారు, పోతుంటారు తాము మాత్రం లోకల్ అన్నారు. టికెట్ కోసం తమకు చాడీలు చెప్పడం, ఇంకొకరిని ముంచడం తెలియదన్నారు. అభ్యర్థిని ఎంపిక చేసే ముందు కనీసం సంప్రదించరా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఎవరు పార్టీలో ఉన్నారు, ఎవరు పార్టీ కోసం కష్టపడ్డారు అన్న విషయాలను గుర్తించాలని చంద్రబాబుకు సూచించారు. ఎన్టీ రామారావు ఆహ్వానించినప్పటి నుంచి పార్టీకి సేవ చేశామన్నారు.త్వరలో మరోసారి సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని వారు వెల్లడించారు.

ఈ-కేవైసీకి మూడు రోజులే గడువు



హిందూపురం అర్బన్: టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ రద్దీ పెరగకుండా కేంద్ర ప్రభుత్వం ఫాస్టాగ్ ద్వారా టోల్ ట్యాక్స్ వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఫాస్ట్‌ట్యాగ్‌కు కేవైసీ అప్‌డేట్ చేయడం చాలా ముఖ్యం. గతంలో కేవైసీ పూర్తి చేసేందుకు గడువు జనవరి 31తో ముగిసింది. అయితే వాహనదారుల అభ్యర్థన మేరకు గడువును ఫిబ్రవరి 29వ తేదీ వరకు పెంచుతూ నేషనల్ హైవే అథారిటీ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ కేవైసీకి మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ కేవైసీ చేయించుకోకపోతే అకౌంట్ డీయాక్టివేట్ అవుతుందని బెంగళూరు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీనికి తోడు టోల్‌ప్లాజాల వద్ద రెట్టింపు టోల్ వసూలు చేస్తారన్నారు. టోల్‌గేట్ల వద్ద ఈ–కేవైసీ చేసేందుకు సహాయకులు ఉంటారని, లేకపోతే వెబ్‌సైట్ https:// fastag. ihmcl. com ద్వారా కూడా అప్‌డేట్ చేసుకోవచ్చని సూచించారు.



పరీక్ష రాసేందుకు వెళ్తున్న దివ్యాంగుడు



అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



అభ్యర్థుల వివరాలు పరిశీలిస్తున్న పోలీసులు



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

కలల కొలువు కొట్టాలని..

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో గ్రూప్–2 స్క్రీనింగ్ పరీక్ష సజావుగా సాగింది. అభ్యర్థుల హాజరు 84 శాతంగా నమోదయ్యింది. 32,391 మంది అభ్యర్థులకు గానూ 27,324 మంది హాజరయ్యారు. 5,067 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 111 కేంద్రాల్లో అత్యంత పకడ్బందీగా పరీక్ష నిర్వహించారు. 38 మంది రూట్ అధికారులు, 111 మంది లైజన్ అధికారులు విధులు నిర్వర్తించారు.పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఇబ్బందుల్లేకుండా మౌలిక వసతులు కల్పించారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణను ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ డి.అపరంజిని, సెక్షన్ ఆఫీసర్లు పి.వి.నవజ్యోతి, జె.యశోద పర్యవేక్షించారు.

ఎస్పీ తనిఖీ..

అనంతపురం: నగరంలో పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పరిశీలించారు. ఎస్ఎస్‌బీఎన్, ఆర్ట్స్ కళాశాల, సెయింట్ ఆన్స్ కళాశాలల్లో కేంద్రాలను తనిఖీ చేశారు. పోలీసు బందోబస్తును సమీక్షించారు. ఎస్పీతో పాటు పోలీసు అధికారులు ఉన్నారు.

జోరుగా కృష్ణమ్మ గలగలలు

కృష్ణా జలాల వాటాలో జిల్లాకు సింహభాగం దక్కింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఇదంతా సాధ్యమైంది. అయితే, ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రజలను ఏమార్చేందుకు ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా నీటి రాజకీయాలకు తెరతీశాయి. కృష్ణా జలాలు కుప్పంకు తరలిపోతున్నాయంటూ రాద్ధాంతం చేస్తున్నాయి.

- నేటికీ జిల్లాలో కృష్ణా జలాల ప్రవాహం
- తాగునీటి ఇబ్బందులు దూరం
- భూగర్భ జలాల వృద్ధికి దోహదం
- పంటల సాగుకు భరోసా కల్పించిన వైనం
- ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల దృష్టి మరల్చేందుకు రాద్ధాంతం



కృష్ణాజలాలతో కళకళలాడుతున్న కూడేరు మండలం ముద్దలాపురం చెరువు

అనంతపురం సెంట్రల్: శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ 28.304 టీఎంసీలు ఎత్తిపోశారు. ఇందులో ప్రవాహ నష్టాలు పోనూ ఉమ్మడి అనంతపురం జిలాకు 15.637 టీఎంసీలు అందాయి. ముందు ఉన్న కర్నూలు జిల్లాకు 4.023 టీఎంసీలు, అనంతపురం జిల్లా తర్వాత వచ్చే అన్నమయ్య జిల్లాకు 1.589 టీఎంసీలు వెళ్లాయి. జిల్లాకు అందిన కృష్ణా జలాల్లో గుంతకల్లు డివిజన్ పరిధిలో చెరువులకు 0.352 టీఎంసీలు వినియోగించారు. దాదాపు 45 చెరువులను నింపారు. జీడిపల్లి రిజర్వాయర్‌కు 9.033 టీఎంసీలు, గొల్లపల్లి– 0.204 టీఎంసీలు, చెర్లోపల్లి రిజర్వాయర్‌కు 1.938 టీఎంసీలు అందించారు. పీఏబీఆర్‌కు నీటిని వదిలారు. 4.735 టీఎంసీలు సాగునీటికి విడుదల చేశారు.

కృష్ణా జలాల వినియోగం ఇలా..	
శ్రీశైలం నుంచి హంద్రీ నీవాకు వచ్చిన నీరు	28.304 టీఎంసీలు
జిల్లాకు విడుదలైన నీరు	15.637 టీఎంసీలు
కర్నూలు	4.023 టీఎంసీలు
అన్నమయ్య	1.589 టీఎంసీలు

సీఎం చొరవతో..

వరుణుడు ముఖం చాటేయడంతో గత ఏడాది వర్షాభావ పరిస్థితులను చవిచూడాల్సి వచ్చింది. ప్రాజెక్టులకు ఆశించిన మేర వరద నీరు రాలేదు. శ్రీశైలం రిజర్వాయర్‌కు గతంలో కంటే అతి తక్కువ వరద నీరు చేరింది. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలు అందేలా చర్యలు తీసుకున్నారు. సీఎం సంకల్పానికి అనుగుణంగా అధికారులు నీటి పంపిణీ పకడ్బందీగా చేపట్టారు. దీంతో నేటికీ జిల్లాలో కృష్ణా జలాలు ప్రవహిస్తున్నాయి. హంద్రీనీవా కాలువ పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. పశుపక్ష్యాదులకు తాగునీటి కొరత తీర్చాయి.



నిండుకుండను తలపిస్తున్న కరుట్లపల్లి చెరువు

ఎల్లో మీడియా గగ్గోలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలతో కరువు జిల్లా చల్లగా ఉంటే ఎల్లో మీడియా ఓర్వలేకపోతోంది. కుప్పంకు నీటిని తరలిస్తున్నారంటూ గగ్గోలు పెడుతోంది. రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీనీవా ఎత్తిపోతల పథకం చేపట్టారు. అందులో భాగంగానే నేడు అన్ని ప్రాంతాలకు సమంగా నీటిని పంపిణీ చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం నీచ రాజకీయాలకు తెరతీస్తున్నాయి. ప్రజల దృష్టి మరల్చేందుకు ఎల్లో మీడియా అసత్య కథనాలు వండుతూ నానా యాగీ చేస్తోంది. దీనిపై అన్ని వర్గాల నుంచి విస్మయం వ్యక్తమవుతోంది.

పుష్కలంగా నీరు



గత ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో పంటలు పండలేదు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు వస్తాయని ఆందోళన చెందాం. అయితే హంద్రీనీవా ద్వారా మా ఊరి చెరువుకు నీటిని విడుదల చేశారు. దీంతో ముప్పు తప్పింది. చెరువుకు సమీపంలో వందలాది ఎకరాల్లోని బోరుబావుల్లో పుష్కలంగా నీరు వస్తోంది. – సూర్యనారాయణ,
రైతు, ముద్దలాపురం, కూడేరు మండలం

ఉమ్మడి జిల్లాకే 80 శాతం నీరు



గత ఏడాది లోటు వర్షపాతంతో శ్రీశైలం జలాశయానికి అనుకున్న స్థాయిలో వరద రాలేదు. అయినా సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో వ్యవహరించి నీటిని రాబట్టారు. రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలను తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకే 80 శాతం నీటిని వాడుకున్నాం. ఆయకట్టును కాపాడడంతో పాటు తాగునీటి కోసం చెరువులకు విడుదల చేశాం. జిల్లాతో పాటు అన్ని ప్రాంతాలకు సమంగా నీటిని పంపిణీ చేసేందుకు సిబ్బందితో కలిసి రేయింబవళ్లు కష్టపడుతున్నాం.
– దేశానాయక్, ఎస్ఈ,
హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు

అశ్వవాహనంపై శ్రీవారి ఊరేగింపు



బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కొండమీదరాయుడు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం అర్చకులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. మహిళలు స్వామికి హారతులు పట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

నేటితో బ్రహ్మోత్సవాల ముగింపు..

కొండమీద వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థవాది వసంతోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు స్వామివారు హంస వాహనంలో ఊరేగుతూ ప్రజలకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన కోటంక

- ఘనంగా శ్రీవారి కళ్యాణం
- వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల
- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- దుకాణాల వద్ద భక్తుల సందడి



వెండి కవచ అలంకరణలో దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల మూడో ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శనివారం రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం తెల్లవారుజామున విశేష పూజలు, అర్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై అధిష్ఠింపజేసి వేలాది భక్తుల గోవిందనామస్మరణతో ముందుకు లాగారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. తిరునాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఆలయ ధ్వజ స్తంభ దాత మోదుపల్లి సుబ్బయ్య ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

రైల్వే అప్‌గ్రేడ్‌కు కేంద్రం కట్టుబడి ఉంది

- ఎంపీ రంగయ్యకు కేంద్ర రైల్వే మంత్రి లేఖ

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో రైల్వే సేవలు, మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేసేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ తలారి రంగయ్యకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లేఖ రాశారు. ఈ విషయాన్ని ఎంపీ రంగయ్య ఆదివారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం రూ.68,059 కోట్ల పనులు పురోగతిలో ఉన్నట్లుగా లేఖలో వివరించారన్నారు. ఏపీలో రికార్డు స్థాయిలో 2024–25 బడ్జెట్‌లో రూ.9,138 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారన్నారు. 72 రైల్వేస్టేషన్లను ప్రపంచ స్థాయి రైల్వే స్టేషన్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు లేఖలో వివరించారన్నారు.

రేపటి నుంచి 'జగనన్న పాల వెల్లువ'

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో మంగళవారం నుంచి 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమం ప్రారంభించనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సంబంధిత రూట్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని పేర్కొన్నారు. అనంతపురం, బుక్కరాయసముద్రం, రాప్తాడు, ఆత్మకూరు, నార్పల మండలాల్లోని 54 ఆర్బీకేల పరిధిలో ఉన్న 98 గ్రామాల నుంచి పాల సేకరణ మొదలవుతుందన్నారు. అమూల్ సహకారంతో ఇప్పటికే అన్ని గ్రామాల్లో మహిళా సంఘాలతో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. పాల సేకరణ సామగ్రి, అధునాతన బిల్లింగ్ మిషన్లు ఇతరత్రా మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. రాచానపల్లి, కొర్రకోడు గ్రామాల్లో బీఎంసీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేట్ డెయిరీలకన్నా లీటర్‌పై అదనంగా రూ. 5 నుంచి 10 వరకూ చెల్లిస్తారన్నారు.

14 కేంద్రాల్లో 'టెట్'

- ఉమ్మడి జిల్లాలో 10, బెంగళూరులో 4 కేంద్రాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీ టెట్) నిర్వహణకు 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 (అనంతపురంలో 6, తాడిపత్రిలో 2, గుత్తి, పుట్టపర్తిలో ఒక్కో కేంద్రం) బెంగళూరులో 4 కేంద్రాల్లో ఈనెల 27 నుంచి మార్చి 6 వరకూ పరీక్షలు జరగనున్నాయి. రోజూ రెండు విడతలుగా.. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సాగుతాయి. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదేని గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి తెలిపారు. గంట ముందే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పూర్తి వివరాలను https:// deo ananthapuramu. blogspot.com వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, అభ్యర్థులు పరిశీలించుకోవాలని కోరారు.

28న సైన్స్ డే సంబరాలు నిర్వహించండి

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని ఈనెల 28న సంబరాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించి, శాస్త్రీయ దృక్పథం పెంచే కార్యక్రమాలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులు, సైన్స్, గణితం టీచర్లకు సూచించారు. ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌టీవీలను వినియోగించుకుని ప్రఖ్యాత శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, వారు ప్రపంచానికి అందించిన ఆవిష్కరణలు పిల్లలకు తెలియజేయాలన్నారు. సైన్స్ క్విజ్, పాఠశాల స్థాయి సైన్స్‌ఫేర్, సైన్స్ నాటికలు, 'ప్రపంచ గతిని మార్చిన సైన్స్ ఆవిష్కరణలు' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు.

సుర్రుమంటున్న సూరీడు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా వేసవి తాపం ప్రారంభమైంది. రాత్రి, పగలు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి నుంచి సూరీడు మరింత చెలరేగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏప్రిల్‌తో పాటు మే నెలలో గ్రీష్మ తాపం పతాక స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొన్నాళ్లుగా మధ్యాహ్న సమయంలో ఎండలు సుర్రుమనిపిస్తున్నా.. ఉదయం చాలా మండలాల్లో చలి వాతావరణం నెలకొంది. అయితే 2 రోజులుగా ఉదయం పూట కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శనివారం శింగనమలలో 39.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. విడపనకల్లు, గుంతకల్లు, నార్పల, బుక్కరాయసముద్రం, అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు తదితర మండలాల్లో 38 నుంచి 39 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా శనివారం చెన్నేకొత్తపల్లిలో 39.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, ధర్మవరం, పరిగి, ముదిగుబ్బ,కనగానపల్లి, బత్తలపల్లి, కొత్తచెరువు తదితర మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవి ప్రారంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువ అవుతుండటం గమనార్హం. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా మొదట్లోనే 20 నుంచి 25 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో భానుడి భగభగలు అధికంగా కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలలో పగటి ఉష్ణోగ్రత 45 డిగ్రీల మార్క్ చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

రైల్వే స్టేషన్లకు మహర్దశ

- 'అమృత్ భారత్' అమలుతో మారనున్న రైల్వేస్టేషన్ రూపురేఖలు
- ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, గుత్తి, తాడిపత్రి, ధర్మవరం రైల్వేస్టేషన్లలో ఆధునికీకరణ పనులు

అనంత కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరనుంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన అనంతపురం రైల్వేస్టేషన్ రూపురేఖలు సమూలంగా మారిపోనున్నాయి. ప్రయాణికుల రద్దీ, పెరిగిన రైళ్ల సంఖ్యకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఉమ్మడి జిల్లాలోని పలు రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులకు దక్షిణ మధ్య రైల్వే శాఖ శ్రీకారం చుట్టింది. అమృత్ భారత్ పథకంలో భాగంగా అనంతపురం, గుత్తి, తాడిపత్రి, ధర్మవరం, హిందూపురం రైల్వేస్టేషన్లకు మహర్దశ చేకూరనుంది. నేడు న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో పనులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు.

అనంతపురం సిటీ: జిల్లాలోని రైల్వే స్టేషన్లను అన్ని హంగులతో ఆధునీకరించేందుకు దక్షిణ మధ్య రైల్వే శాఖ ముందుకొచ్చింది. ఇందులో భాగంగా గుంతకల్లు రైల్వే డివిజన్ వ్యాప్తంగా 15 రైల్వే స్టేషన్లను ఆధునీకరించనున్నారు. ఇందులో అనంతపురం, ధర్మవరం, గుత్తి, తాడిపత్రి, కడప, రాజంపేట, ఆదోని, డోన్, చిత్తూరు, మదనపల్లి, శ్రీకాళహస్తి, మంత్రాలయం, కర్ణాటకలోని రాయచూరు, యాదగిరి రైల్వే స్టేషన్లు ఉన్నాయి.

'అనంత' అందాలకు రూ.9.29 కోట్లు..

అమృత్ భారత్ పథకం అమలులో భాగంగా అనంతపురం రైల్వేస్టేషన్‌ను అత్యంత ఆధునిక హంగులతో పునర్నిర్మించేందుకు రూ.9.29 కోట్లను వెచ్చించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే అనంతపురం రైల్వేస్టేషన్‌లో మొదటి రోడ్డు వైపున పనులు పూర్తి కావొచ్చాయి. ఇటువైపు ఉన్న పాత బిల్డింగులను నేలమట్టం చేశారు. అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన మిగిలిన 14 రైల్వే స్టేషన్లను కూడా ఇదే తరహాలో ఆధునికీకరించనున్నారు. గుత్తి స్టేషన్‌కు రూ.17.13 కోట్లు, తాడిపత్రి స్టేషన్‌కు రూ.7.68 కోట్లు, ధర్మవరం స్టేషన్‌కు రూ.8.64 కోట్లు కేటాయించారు.



అనంతపురం రైల్వే స్టేషన్ నమూనా

చేపట్టనున్న పనులు..

ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఆకర్షణీయమైన ముఖ ద్వారాలు, ఉద్యానీకరణ పనులతో పాటు రోడ్ల విస్తరణ, సౌకర్యవంతమైన అంతర్గత రహదారులు నిర్మాణం, పార్కింగ్, మెరుగైన విద్యుద్దీకరణ పనులు చేయనున్నారు. అలాగే ల్యాండ్‌స్కేపింగ్, గ్రీన్ ప్యాచ్‌లతో రైల్వే ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచేలా చేయనున్నారు. స్టేషన్ బిల్డింగ్, సర్క్యులేటింగ్ ఏరియా కోసం రెండో ప్రవేశ ద్వారం ఏర్పాటు, ఉన్నత స్థాయి ప్లాట్‌ఫారమ్‌లు, లిఫ్టులు, తగినన్ని షెల్టర్ల నిర్మాణం, అధిక నాణ్యత గల పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, ఎల్‌ఈడీ ఆధారిత స్టేషన్ నేమ్ బోర్డులు, అత్యాధునిక వెయిటింగ్ హాళ్లు, యూజర్ ఫ్రెండ్లీ సంకేతాలు ఏర్పాటు చేయనున్నారు.

గర్వంగా ఉంది



అంతర్జాతీయ ప్రమాణాలతో రైల్వే స్టేషన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతుండడం చాలా గర్వంగా ఉంది. ఈ పనులు పూర్తయితే రైల్వే స్టేషన్లు అంతర్జాతీయ విమానాశ్రయాలను తలపిస్తాయనడంలో సందేహం లేదు.

– సుమతి సురతాని, పారిశ్రామిక వేత్త, అనంతపురం

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి



అనంతపురం రైల్వేస్టేషన్ ఒక వైపు పూర్తిగా అభివృద్ధి చేశారు. చూస్తుంటే ఎంతో సంతోషమేస్తోంది. వృద్ధులు, వికలాంగులకు సౌకర్యవంతంగా ఉండేలా లిఫ్టులు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తే సామాన్య, మధ్య తరగతి వర్గాల వారికి ఎంతో మేలు చేసిన వారవుతారు.

– రజిత, చిరుద్యోగి, అనంతపురం

యుద్ధ ప్రాతిపదికన పనులు



అనంతపురం రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. రూ.9.29 కోట్లతో అన్ని హంగులతో స్టేషన్‌ను ఆధునీకరించనున్నారు. ఇప్పటికే ఒక వైపు పనులు పూర్తి కాగా, మరో వైపు పనులు ఊపందుకున్నాయి.

– మాసినేని అశోక్‌కుమార్, రైల్వే స్టేషన్ మేనేజర్, అనంతపురం

క్లుప్తంగా

యువకుడి దుర్మరణం



మృతుడు ప్రవీణ్

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి లారీని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటక రాజధాని బెంగళూరులోని నగరబావికి చెందిన ప్రవీణ్ (31) వెల్డర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా పంపనూరులో కొన్ని రోజులుగా వెల్డింగ్ పనుల్లో పాలు పంచుకుంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై బెంగళూరుకు బయలుదేరాడు. పెనుకొండ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై కియా పోలీస్ స్టేషన్ ఎదురుగా స్పీడ్ బ్రేకర్లను దాటుకునే క్రమంలో వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న లారీని ఢీకొంది. ఘటనలో తలకు తీవ్ర గాయమై ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కియా ఎస్‌ఐ రంగడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు నుంచి జారిపడిన యువకుడు

అనంతపురం సిటీ: రైలు నుంచి జారిపడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... బెంగళూరు నుంచి రాయచూరుకు బయలుదేరిన రైలు ఆదివారం ఉదయం అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో డోరు వద్ద నిలబడి ప్రయాణిస్తున్న ఓ యువకుడు అదుపు తప్పి ప్లాట్‌ఫారంపై పడ్డాడు. ఘటనలో ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని కర్ణాటకలోని మద్వార్‌కు చెందిన సన్న తమ్మన్న కుమారుడు రాజుగా గుర్తించారు. 108 అంబులెన్స్ ద్వారా జీజీహెచ్‌కు జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది తరలించారు.

ప్రమాదంలో గ్రూప్-2 అభ్యర్థికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో గ్రూప్-2 అభ్యర్థితో పాటు ఆమె తండ్రి కూడా గాయపడ్డారు. వివరాలు... అనంతపురంలోని జేఎన్‌టీయూ(ఏ) విద్యార్థిని హేమలత ఆదివారం ఉదయం గ్రూప్-2 పరీక్ష రాసేందుకు తన తండ్రి నరసింహులతో కలసి ద్విచక్ర వాహనంపై పెద్దవడుగూరు మండలం వైపుగా బయలుదేరారు. కల్లూరులోని అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకోగానే ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో హేమలత, నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భర్త చేతిలో భార్య హతం



హతురాలు అరుణ

తాడిపత్రి అర్బన్: మద్యం మత్తులో భార్యను హతమార్చిన ఘటన తాడిపత్రిలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని విజయలక్ష్మి థియేటర్ సమీపంలో నివాసముంటున్న అరుణ(38), రామాంజినేయులుకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్న రామాంజినేయులు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రోజూ సంపాదన మొత్తం తాగుడుకే ఖర్చు చేసి మత్తులో ఇంటికి చేరుకోవడం మొదలు పెట్టాడు. తాగుడు మానేసి పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని భార్య పలుమార్లు చెప్పినా పెడచెవిన పెట్టేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రామాంజినేయులును అరుణ గట్టిగా నిలదీసింది. యుక్తవయసుకొచ్చిన కుమార్తెకు పెళ్లి చేయాలనే ఆలోచన లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించింది. ఆ సమయంలో రామాంజినేయులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోకలి బండ తీసుకుని అరుణ తలపై గట్టిగా బాదాడు. ఘటనతో కుప్పకూలిన అరుణను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. హతురాలి సోదరుడు గొందివల్లి రామాంజినేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

గుమ్మఘట్ట: యువకుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన గొల్ల లోకేష్ కుమారుడు శ్రీకాంత్ నాలుగేళ్ల క్రితం ఇంటర్ ఫెయిల్ అయ్యాడు. ఈ క్రమంలో ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉంటూ వస్తున్నాడు. ఈ నెల 22వ తేదీ రాత్రి ఇంటిపై నిద్రిస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు ఆ తర్వాత కనిపించకుండా పోయాడు. చుట్టు పక్కల గ్రామాల్లోని స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

'ఎన్‌రీచ్‌మెంట్'కు భారీ స్పందన



సదస్సుకు హాజరైన ప్రైవేట్ టీచర్లు



హాజరైన ముఖ్య అతిథులు

- హాజరైన 1,600 మంది ప్రైవేట్ టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: బోధనా పద్ధతులపై ప్రైవేట్ పాఠశాలల్లోని ప్రీప్రైమరీ, ప్రైమరీ టీచర్లకు అవగాహన కల్పించేందుకు ‘అపుస్మా’ ఆధ్వర్యంలో ‘ఎన్‌రీచ్‌మెంట్’ పేరుతో ఆదివారం అనంతపురంలో ఏర్పాటు చేసిన సదస్సుకు భారీ స్పందన లభించింది. స్థానిక గుత్తిరోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 1,600 మంది ప్రైవేట్ టీచర్లు హాజరయ్యారు. విశాఖపట్టణానికి చెందిన స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్లు రాము నాయుడు, వాణిశ్రీ ముఖ్య అతిథులుగా హాజరై, పలు అంశాలపై అవగాహన కల్పించారు. నర్సరీ నుంచి 5వ తరగతి వరకూ పిల్లల్లో విద్యాభ్యాసానికి చేపట్టాల్సిన విధానాలను వివరించారు. తరగతి గదిలో పిల్లలను యావరేజ్, అబౌయావరేజ్ వంటి పదాలతో విడదీసి బోధించడం మంచి టీచర్ల లక్షణం కాదన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన సదస్సు సాయంత్రం 5గంటల వరకూ కొనసాగింది. అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, కార్యదర్శి చంద్ర, నాయకులు ఇక్బాల్, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, నాయిడు, నాగరాజు, శ్రీనాథ్, రవిశంకర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి గేట్ ఎత్తివేతకు శ్రీకారం



మాట్లాడుతున్న డీఆర్ఎం వినీత్‌సింగ్

గుంతకల్లు: కల్లూరు రైలు మార్గంలోని హనుమాన్ సర్కిల్ (హౌసింగ్ బోర్డు కాలనీ) సమీపంలో ఉన్న బళ్లారి లెవల్ క్రాసింగ్ గేట్‌ను ఎత్తివేత వేయనున్నట్లు డీఆర్ఎం వినీత్‌సింగ్ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏడీఆర్ఎం సూర్యానారాయణతో కలసి ఆయన మాట్లాడారు. ధర్మవరం ఎల్‌సీ గేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ముగిసిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రయాణికుల భద్రతా చర్యల్లో భాగంగా బళ్లారి గేట్ ఎత్తివేత అంశాన్ని గతంలో రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లినట్లుగా గుర్తు చేశారు. ప్రస్తుతం అక్కడ రోడ్డు ఓవర్ బ్రిడ్జి, రోడ్డు అండర్ బ్రిడ్జి ఏర్పాటు అంశంపై స్పష్టత లేదన్నారు. అలాగే కసాపురం రైల్వే మోరీ వద్ద మరో వంతెన నిర్మించే అంశం కూడా పెండింగ్‌లో ఉందన్నారు.

నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని..

అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని డీఆర్ఎం తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎంపికైన 15 రైల్వేస్టేషన్లను దాదాపు రూ.137.38 కోట్లుతో ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. అలాగే డివిజన్ వ్యాప్తంగా పూర్తయిన 16 ఆర్‌యూబీలనూ ప్రారంభిండంతో పాటు మరో 9 ఆర్‌యూబీ పనుల ప్రారంభానికి పచ్చజెండా ఊపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ డీసీయం మనోజ్, సీసీఐ హేమంత్‌కుమార్, ఎస్ఎం నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పరిగి: మండలంలోని కాలువపల్లి సమీపంలో ఉన్న గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు... రొద్దం మండలం నల్లూరు గ్రామానికి చెందిన డ్రైవర్ నరసింహమూర్తి (48) పరిగి మండలం కాలువపల్లి వద్ద ఉన్న గార్మెంట్స్ పరిశ్రమలకు ఆటోలో మహిళా కార్మికులను తరలించేవాడు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులకు తెలిపి ఆటోలో కార్మికులను తీసుకుని పరిశ్రమకు బయలుదేరాడు. ఉదయం 10 గంటలకు కాలువపల్లి గేట్ సమీపంలోని ఓ గోదాం వద్ద మృతదేహమై కనిపించాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించి భార్య సిద్దగంగమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు. అయితే తన భర్త మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇంట్లో చోరీ

గుత్తి: స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్న నరేంద్ర ఇంట్లో చోరీ జరిగింది. తన భార్య రేవతితో కలసి మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నరేంద్ర ఉప్పర్లపల్లికి వెళ్లారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని నగదు, వెండి ఆభరణాలు, ఎల్‌ఈడీ టీవీ అపహరించుకెళ్లారు. ఆదివారం ఇంటికి చేరుకున్న దంపతులు అప్పటికే తలుపులు తీసి ఉండడం గమనించి లోపలికెళ్లి చూశారు. బీరువాలోని రూ.35 వేల నగదుతో పాటు వెండి వస్తువులు, ఎల్‌ఈడీ టీవీ కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి, అబ్దుల్ ఖాదర్ అనే అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో చోరీ చేసింది తానేనని అబ్దుల్ ఖాదర్ ఒప్పుకుంటూ నగదు, వెండి ఆభరణాలు స్వాధీనం చేశాడు. వీటిని బాధితులకు సీఐ వెంకట్రామిరెడ్డి అప్పగించారు.

యువకుడి ఆత్మహత్య

కుందుర్పి: క్షయ వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి గ్రామానికి చెందిన బోయ నారాయణప్ప కుమారుడు మంజునాథ్ (21) కొంత కాలంగా క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఊపిరి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్న మంజునాథ్ శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటస్వామి, అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

27న మహిళా ఉద్యోగ మేళా

అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న మహిళా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పాస్, డిగ్రీ పాస్/ ఫెయిల్ అయి 18 నుంచి 26 సంవత్సరాల్లోపు వయసున్న నిరుద్యోగ మహిళలు అర్హులు. అభ్యర్థులు 43 కిలోల నుంచి 65 కేజీల బరువు ఉండాలి. 145 సెంటీమీటర్ల పైబడి ఎత్తు ఉండాలి. ఉద్యోగానికి ఎంపికైన వారు కర్ణాటకలోని కోలారు జిల్లా నర్సాపుర పారిశ్రామిక వాడలోని ప్రముఖ మొబైల్, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలో ప్రొడక్షన్ ఆపరేటర్లు, టెక్నికల్ ఆపరేటర్లుగా పనిచేయాల్సి ఉంటుంది. వీరికి నెలకు వేతనం కింద రూ.18,175, రూ. వెయ్యి అటెండెన్స్ బోనస్ చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పిస్తారు. ఆసక్తి ఉన్న మహిళా నిరుద్యోగులు తమ బయోడేటాతో ఈ నెల 27న జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. పూర్తి వివరాలకు 95138 22234లో సంప్రదించవచ్చు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా కేంద్రంలోని క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి జూనియర్ తైక్వాండో పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి నరసింహారెడ్డి, మచ్చా రామలింగారెడ్డి, రంగంపేట గోపాలరెడ్డి, జిల్లా తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి గురుస్వామి, ఆర్గనైజర్ సెక్రెటరీ శాంతరాజ్ హాజరయ్యారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

సహకార యూనియన్ జాతీయ కార్యవర్గంలో పలువురికి చోటు



జాతీయ కార్యవర్గానికి ఎంపికైన జిల్లా నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: ఆల్ ఇండియా కో ఆపరేటీవ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన కేవీఎస్ రవికుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు యూనియన్ జిల్లా కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల కో ఆపరేటీవ్ ఫెడరేషన్ ప్రతినిధులతో ఆదివారం హైదరాబాద్‌లో 8వ జాతీయ మహాసభలు జరిగాయి. ఇందులో నూతన జాతీయ కార్యవర్గం ఎంపిక చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న రవికుమార్‌ను జాతీయ ప్రధాన కార్యదర్శిగా, సి.సునీతను జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి గ్యాస్ లీక్

అనంతపురం: నగరంలోని చెన్నై జాతీయ రహదారిపై విజయనగర కాలనీకి ఆనుకుని ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ బంక్ పరిధిలోని సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి ఆదివారం రాత్రి గ్యాస్ లీకైంది. రాత్రి 8 నుంచి గ్యాస్ బయటకు వెళ్తున్నా నిర్వాహకులు నివారించే ప్రయత్నం చేయలేదు. దీంతో విజయనగర కాలనీ వాసులు ఆందోళనకు గురయ్యారు. 8:20 గంటలకు గ్యాస్ సిబ్బంది అక్కడకు చేరుకుని లీకేజీని అరికట్టారు. అదృష్టవశాత్తూ ఎలాంటి పెనుప్రమాదం చోటు చేసుకోకపోవడంతో విజయనగర కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

తిరునాలలో యువకుల ఘర్షణ

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు తిరునాలలో శనివారం అర్ధరాత్రి యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం వన్నేదొడ్డి, శ్రీపురం గ్రామాలకు చెందిన పలువురు యువకులు శనివారం సాయంత్రం తిరునాలకు వచ్చారు. రద్దీలో నడుచుకుంటూ వెళ్లే క్రమంలో ఒకరినొకరు తోసుకోవడంతో ఘర్షణ చెలరేగింది. అదే సమయంలో పక్కనే ఉన్న రజాపురం గ్రామానికి చెందిన కొందరు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. దీంతో తీవ్ర స్థాయిలో వాగ్వాదం చేసుకుంటూ శ్రీపురం గ్రామానికి చెందిన శివ, సుభాష్, గోవర్దన్, రజాపురం గ్రామానికి చెందిన నరేంద్రబాబు, దుర్గా, ఎర్రిస్వామి, రమేష్, వెంకి పరస్పరం కట్టెలు, ఇనుప రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.



తిరునాలలో భక్తుల రద్దీ



పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

అశ్వత్థానికి పోటెత్తిన భక్తులు

పెద్దపప్పూరు: మాఘమాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకుని పెద్దపప్పూరు మండలం అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పెన్నానదిలో పుణ్య స్నానాలు ఆచరించి నారాయణస్వామి, శ్రీచక్ర భీమలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొన్నారు. నది లోతట్టు ప్రాంతానికి వృద్ధులు, చిన్నారులు వెళ్లకుండా పెద్దవడుగూరు సీఐ రోషన్, ఎస్‌ఐ శరత్‌చంద్ర ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వసతి, సౌకర్యాలను ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. మొక్కుబడిలో భాగంగా పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి ఏర్పాటు చేసిన రంగస్థల నాటకం ఆకట్టుకుంది.

క్లుప్తంగా

పంపనూరులో మాఘ మాస పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాఘమాస పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించిన తర్వాత ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. బంగారు కవచసేవ, ఆకుపూజ అలంకరణ నిర్వహించారు. స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షణలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కాల సర్పదోష నివారణ హోమాలను నిర్వహించారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి పూజలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు.

హిందూ ధర్మ పరిరక్షణకు బుల్లెట్ యాత్ర



రాజ్యలక్ష్మికి స్వాగతం పలుకుతున్న అనంత కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం తమిళనాడు నుంచి మందా రాజ్యలక్ష్మి అనే మహిళ చేస్తున్న బుల్లెట్ యాత్ర ఆదివారం నగరానికి చేరుకుంది. ఆమెకు ఓం సంగీత నృత్యకోలాట శిక్షణా సంస్థ నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య బృందం ఘనంగా స్వాగతం పలికింది. అనంతరం వారు ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రధాని మోదీ సనాతన ధర్మానికి ఎనలేని ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. ఆయనను మరోసారి పీఎంను చేసుకునేందుకు కృషి చేయాలన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆశ్రమ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: నగరంలోని శివ బాలయోగి ఆశ్రమంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ తెలిపారు. ఆదివారం ఆశ్రమంలో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. వచ్చే నెల 8న మహాశివరాత్రి పర్వదినం నాడు ఆలయంలో కొలువుదీరిన అనంతేశ్వరుడు, శత పార్థివ లింగాలకు వివిధ రకాల పవిత్ర జలాలు, దళాలతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ప్రత్యేకంగా 6 అడుగుల అమరనాథ సహస్ర లింగాన్ని భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాగరణ మహోత్సవానికి శివబాలయోగి మహారాజ్ ట్రస్టు వారు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

ఘనంగా మెహర్‌బాబా జయంతి

అనంతపురం కల్చరల్: భగవాన్ షిర్డీ సాయి బాబా సమకాలీకులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మెహర్‌బాబా 130వజయంతిని సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల అన్న సంతర్పణ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మెహర్‌బాబా 56 ఏళ్ల పాటు మౌనముద్రలో ఉంటూ కోట్లాది మంది భక్తులకు కంటి చూపుతోనే మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చడమే మనిషి కర్తవ్యమని బోధించిన ఆయన ఆదర్శాలకనుగుణంగా అన్నదానం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు విజయసాయికుమార్, అమర్‌నాథ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ కళారూపాలు



సీనియర్ కవి నబీరసూల్‌ను సత్కరిస్తున్న నృత్యకళాకారులు

అనంతపురం కల్చరల్: నగరంలో కళావేదిక త్యాగరాజ సంగీత సభ పునః ప్రారంభమైంది. కళారూపాల ప్రదర్శన ఆదివారం ఘనంగా జరిగాయి. హిందూపురానికి చెందిన అభిజ్ఞ నృత్యాలయం నాట్యాచార్యులు చంద్రభాను చతుర్వేది నేతృత్వంలో ఇండియన్ క్లాసికల్ డాన్సు ఫెస్టివల్ కనులపండువగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక, కేరళ నృత్య కళాకారులు తమ ప్రాంత సంస్కృతులను ప్రతిబింబించే నాట్యరీతులను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అశ్వర్థనారాయణ స్వామి, టీటీడీ ధర్మప్రచార మండలి అధ్యక్షులు శ్రీపాదవేణు, టీసీ వరుణ్ ఆత్మీయ అతిథులుగా విచ్చేసి కళాకారుల ప్రతిభను కొనియాడారు. వీరిని నాట్యకళాకారులు సత్కరించారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- మేమొచ్చాకే ఇంటింటికీ సంక్షేమం, నగరాభివృద్ధి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 18వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్ సీపీ'



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: జగనన్నను మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని 18వ డివిజన్‌లోని ఆదిమూర్తినగర్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్ సీపీ' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తులో ఉన్నాయని, వారి పాలనలో నగరంలో ఏపాటి అభివృద్ధి, సంక్షేమం జరిగిందో ఆలోచించాలన్నారు. అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ వేరుకుంపట్లు పెట్టుకుని అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. సంక్షేమం అందాలంటే జన్మభూమి కమిటీ దయాదాక్షిణ్యాలు ఉండాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉండేదన్నారు. 2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు మాట తప్పారన్నారు. దీంతో ఎన్నో సంఘాలు డీఫాల్ట్ అయ్యి, ఇబ్బందులు పడ్డ పరిస్థితులున్నాయన్నారు. పింఛన్ కోసం నగరపాలక సంస్థ పాఠశాలల వద్ద వృద్ధులు, దివ్యాంగులు నానా అవస్థలు పడేవారన్నారు.

జగనన్న హయాంలో ఇంటి వద్దకే పాలన..

మహాత్మాగాంధీ కన్న కలలను సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే తెలిపారు. నగరంలోని 50 డివిజన్లకు 74 సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పాలన అందిస్తున్నారన్నారు. గతంలో ఏవైనా సర్టిఫికెట్లు పొందాలంటే తహసీల్దార్, ఇతర కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదన్నారు. నేడు అలాంటి సమస్యలన్నీ తొలగిపోయాయన్నారు. పింఛను ఉదయం 5 గంటలకే ఇంటి వద్దకే అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి నెలా రెండు, మూడు రోజుల్లోనే డబ్బు అందిస్తున్నట్లు తెలిపారు. నగరం నలుదిక్కులా అభివృద్ధి జరిగిందన్నారు. రూ.1,045 కోట్లతో రోడ్లు, బ్రిడ్జులు, కాలువలను నిర్మించామన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో ప్రజలు జీవనం సాగించేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్‌మహ్మద్, కార్పొరేటర్లు ముంతాజ్, అబూసలేహా, సాకే చంద్ర, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు జాహ్నవి, శ్రీనివాసులు, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, సైపుల్లాబేగ్, నాయకులు దాదు, ఖాజా, బాకే హబీబుల్లా, గఫార్, అబీద, అన్సర్, హంసూర్, వెంకటప్రసాద్, బాబా, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, సూర్యనారాయణ రెడ్డి, మిద్దె నగేష్, హనుమంతు, చిదంబర్‌రెడ్డి, సాకే కుళ్లాయస్వామి, రాధ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టాలిన్ నగర్‌లో..

నారాయణపురం పంచాయతీలోని స్టాలిన్‌నగర్‌లో సోమవారం 'ఇంటింటికీ వైఎస్సార్ సీపీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. స్టాలిన్ నగర్‌లోని కమ్యూనిటీ హాలు నుంచి కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు.

నేడు 'స్పందన'

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం 'స్పందన' కార్యక్రమం జరగనుంది. ఉదయం 10 గంటల నుంచి అదనపు కమిషనర్ శ్రీహరి బాబు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారు. వివిధ విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారు.

సంతల ఆదాయం రూ.3.02 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.02 లక్షల ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,57,310 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత ద్వారా రూ.1,45,400 వసూలైనట్లు తెలిపారు.

నేడు న్యాయసాధన సభ

అనంతపురం టవర్‌క్లాక్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో న్యాయ సాధన సభ సోమవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో సభా ఏర్పాట్లను పరిశీలించిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపడితే రాష్ట్రంలో అమలు చేసే పథకాలను ఈ సభలో ప్రకటిస్తామన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో పాటు ఇతర ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఐఈఐ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న డాక్టర్ సీవీ శ్రీరామ్

అనంతపురం: ఐఈఐ బలోపేతానికి కృషి చేద్దామని ఐఈఐ ఏపీ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ సీవీ శ్రీరామ్ పిలుపునిచ్చారు. ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ) ఆంధ్రప్రదేశ్ ఏడో కమిటీ సమావేశం జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీరామ్ , గౌరవ కార్యదర్శి డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, స్థానిక కేంద్రం చైర్‌పర్సన్ డాక్టర్ సి. శోభాబిందు, కార్యదర్శి డాక్టర్ ఎం. రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు. ఐఈఐ అనంతపురం కేంద్రానికి జేఎన్‌టీయూలో సొంత భవనాన్ని కేటాయించాలని సమావేశంలో తీర్మానం చేశారు. వీసీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఈఐ స్టేట్ సెంటర్ కమిటీ సభ్యులు డాక్టర్ పి. రవీంద్రబాబు, డాక్టర్ కేఎంఎస్ ప్రకాష్ రావు, డాక్టర్ ఎం. బాబు రావు, డాక్టర్ వి. ఆదినారాయణ రెడ్డి, వీసీల, అనిల్ కుమార్, స్థానిక కమిటీ సభ్యులు డాక్టర్ బి. దిలీప్ కుమార్, జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సింగమనేని' సాహిత్యం నిత్య నూతనం



సింగమనేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాచపాలెం, డాక్టర్ గేయానంద్ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న కవులు, రచయితలు

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖర రెడ్డి

అనంతపురం కల్చరల్: కథా రచయిత సింగమనేని నారాయణ సాహిత్యం నిత్యనూతనమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. సింగమనేని నారాయణ వర్ధంతి సభ ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరిగింది. సత్యబోస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆచార్య రాచపాలెంతో పాటూ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, తరిమెల అమరనాథరెడ్డి, ప్రముఖ రచయిత్రి నిర్మలారాణి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. 18 ఏళ్ల వయసులోనే రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించి అనతి కాలంలోనే రాష్ట్రం గర్వించదగిన రచయితగా పేరు పొందడం గర్వకారణమన్నారు. రైతు పక్షపాతిగా నిలిచి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. వామపక్ష ఉద్యమాలకు అండగా నిలిచిన తీరు స్ఫూర్తి రగిలించిందన్నారు. అంతకు ముందు కవి ముకుందాపురం పెద్దన రాసిన గీతాన్ని గాయకుడు మహీధర్ ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ జయరామప్ప, గోవింద రాజులు, రాజారాం, నల్లప్ప,డాక్టర్ ప్రసూన, సీపీఎం నాయకులు రాంభూపాల్, రామిరెడ్డి, ప్రజాగాయకుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



గాయపడిన విజయకుమార్, వెంకటేష్, లక్ష్మినారాయణరెడ్డి

గుత్తి/గుత్తి రూరల్: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డులో కుంట కట్ట వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో శ్రీకాంత్ అనే వ్యక్తి గాయపడ్డాడు. యాడికి మండలం రాయల చెరువుకు చెందిన శ్రీకాంత్ పని మీద బైక్‌లో గుత్తికి వెళుతుండగా ఎదురుగా మరో బైక్ ఢీ కొంది. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన విజయకుమార్ ఆదివారం వేకువజామున తొండపాడు తిరునాలకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. కొత్తపేట గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి బోల్తాపడి అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా తొండపాడుకు చెందిన వెంకటేష్, వన్నేదొడ్డికి చెందిన సాయి శనివారం అర్ధరాత్రి తొండపాడు తిరునాలకు వెళ్లి, అట్నుంచి జక్కలచెరువులో ఉన్న స్నేహితుడి వద్దకు వెళ్లారు. తిరిగి తొండపాడుకు వస్తుండగా గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ అనంతపురం తరలించారు. అలాగే మండలంలోని ఇసురాళ్లపల్లికి చెందిన లక్ష్మినారాయణ రెడ్డి ఆటోలో గుత్తి వైపునకు వస్తుండగా తొండపాడు నుంచి వస్తున్న కారు టి.కొత్తపల్లి గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మినారాయణ రెడ్డి ఆటోలో ఇరుక్కొని తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు. ఆయా ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో 'షబ్ ఏ బరాత్'



ప్రసంగిస్తున్న మౌలానా సద్దాం హుస్సేన్

అనంతపురం కల్చరల్: 'షబ్ ఏ బరాత్' పర్వదినం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. నగరంలోని జామియా, నూరాని, ఈద్గా, చాందిని, జంగాలపల్లి తదితర మసీదుల్లో జరిగిన ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. రాత్రి నగరంలోని పలు శ్మశాన వాటికల్లో ప్రత్యేక దువా ఆచరించారు. స్థానిక రెండో రోడ్డులోని బాహాద్దీన్ మసీదులో ఇమామ్ యూసఫ్‌ఖాన్ షబ్బే బరాత్ విశిష్టతను తెలియజేశారు. సప్తగిరి సర్కిల్ సమీపంలోని ఈద్గా మసీదులో జరిగిన ప్రార్థనల్లో మేయర్ వసీం పాల్గొన్నారు. గఫూర్ కాలనీలో డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్, మౌలానా సద్దాం హుస్సేన్ తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రెండో రోడ్డు మసీదులో జరిగిన కార్యక్రమంలో ముతవల్లి ఫరీదుద్దీన్, పర్వేష్, అబ్దుల్ సమి, హబీబ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

హరికృష్ణకు సన్మానం



హరికృష్ణను సన్మానిస్తున్న మాజీ జడ్జి కిష్టప్ప తదితరులు

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన హరికృష్ణ ప్రపంచ ఉత్తమ సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్ట్రక్టర్‌గా (ట్రైనర్‌గా) ఈసీ కౌన్సిల్ ఏటీసీ సర్కిల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు పొందారు. దీంతో ఆత్మకూరు మండల కురుబల కులస్తులు స్థానిక కనకదాస కల్యాణ మండలంలో ఆదివారం సుబ్బర హరికృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ జడ్జి కురుబ కిష్టప్ప.... హరికృష్ణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కురుబ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొండమీదరాయుని హుండీ లెక్కింపు



హుండీలో కానుకలు లెక్కిస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని కొండమీదరాయుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవరకొండపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను ఆదివారం లెక్కించినట్లు ఈఓ సాకే రమేష్‌బాబు తెలిపారు. దేవదాయ శాఖ ఉత్సవాల ప్రత్యేక అధికారి సుధారాణి సమక్షంలో లెక్కించామన్నారు. హుండీల్లో కానుకల ద్వారా రూ.3,32,115, భక్తుల ద్వారా చందాల రూపంలో రూ.58,316 మొత్తం రూ.3,90,431 వచ్చిందన్నారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన తరువాత శాశ్వత హుండీల్లోని కానుకలను లెక్కిస్తామన్నారు.

ఘనంగా రంగనాథుడి పార్వేట



అలంకరణలో రంగనాథుడు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం స్వామికి హంసవాహనం, పార్వేట, అశ్వవాహన ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు పలుకూరి రవికుమార్, చేతన్‌వర్మ, లిఖిల్ వర్మ, నవీన్‌కుమార్, ఉదయ్‌కుమార్ మంత్రోచ్చారణల నడుమ స్వామికి విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై ఉంచి గ్రామంలోని జమ్మి చెట్టు వరకూ ఊరేగించారు. భక్తులకు మాణిక్య రంగనాథ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, తాగునీటి వసతి కల్పించారు. ఆలయ పరిసరాల్లో భారీ ఎత్తున అంగళ్లు వెలిశాయి. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ నబీరసూల్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ దేవదాసు, మాణిక్య రంగనాథస్వామి ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర వ్యాప్తంగా మాలలు కూడా అధిక సంఖ్యలో ఉన్నారని, రాజకీయ ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలని మాల సంఘాల జేఏసీ నాయకులు గంగాధరప్ప అన్నారు. మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని జూనియర్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగాధరప్ప మాట్లాడుతూ మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే వారికే తమ మద్దతు ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలైన శింగనమల, మడకశిరలో ఏదో ఒక స్థానాన్ని మాలలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మేవా రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, న్యాయవాది పుల్లయ్య, నీలూరి సురేష్‌బాబు, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనకొండ్లలో గడ్డివాముల దగ్ధం

వజ్రకరూరు: కొనకొండ్ల ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఆదివారం సాయంత్రం గడ్డివాములు కాలిపోయాయి. గ్రామానికి చెందిన రైతులు గోనపాటి శీనప్ప, మల్లికార్జున పశువులకు మేత (గడ్డి) కోసం గడ్డివాములు వేసుకున్నారు. ఆదివారం సాయంత్రం గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి.

వైభవంగా తిరునాల



స్వామివారికి మొక్కుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి పంచాయతీ పరిధిలోని తడకలేరులో అశ్వర్థ నారాయణ స్వామి తిరునాల ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి సోములదొడ్డిలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి తడకలేరు వరకు రథం లాగారు. ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. సోములదొడ్డితో పాటు పాముదాయి, కొట్టాలపల్లి, నాగిరెడ్డిపల్లి, బీజేపీ కాలనీ, రాజీవ్‌నగర్, అనంతపురం నగరం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు వారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యర్రపరెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, సర్పంచ్ లింగేశ్వరి, మాజీ సర్పంచ్ నాగరాజు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, డీలరు ఓబిరెడ్డి, నాగార్జున రెడ్డి, ఉదయ్‌రెడ్డి, ఓబులేసు, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

ఘనంగా గుడి శిఖరం ప్రారంభోత్సవం

అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లి గ్రామంలో ముత్యాలమ్మ గుడి శిఖరం(గోపురం) ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, సర్పంచ్ శోభా తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

పేదల పక్షపాతి జన్నత్ హుసేన్



జన్నత్ హుసేన్ ఆత్మకు శాంతి చేకూరాలంటూ ప్రార్థన చేస్తున్న ఆల్‌మేవా నాయకులు

అనంతపురం అర్బన్: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుసేన్ పేదల పక్షపాతి అని ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వేల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) నాయకులు కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని ఖజానా ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జన్నత్ హుసేన్ సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్నత్ హుసేన్ ఆత్మకు శాంతి చేకూరాలంటూ నాయకులు దువా చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్షావలి, ఫారూక్ మాట్లాడారు. గొప్ప పరిపాలనాదక్షునిగా జన్నత్ హుసేన్ మన్ననలు అందుకున్నారన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు ముఖ్య కార్యదర్శిగా పనిచేశారని, ఉచిత విద్యుత్ పథకం రూపకల్పనలో కీలక పాత్ర పోషించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కలెక్టర్ నుంచి స్పెషల్ సీఎస్ వరకు వివిధ హోదాల్లో ప్రజలకు నిజాయితీగా సేవలందించారన్నారు. ప్రతి ఉద్యోగికీ ఆయన ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫక్రుద్దీన్, దౌలా, జిలాన్, మహబూబ్‌బాషా, అన్వర్, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఏటి గంగమ్మా.. సల్లంగ చూడమ్మా!



అలంకరణలో ఏటి గంగమ్మ , ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

ఉరవకొండ: ఏటి గంగమ్మకు భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామి ఆలయ సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన ఏటి గంగమ్మ ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే జిల్లా నలమూలల నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి తరలివచ్చారు. పెన్నానదిలో కుటుంబ సమేతంగా స్నానాలు చేసిన అనంతరం ఏటి గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి వనభోజనాలు చేసి, అనంతరం లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, గుంతకల్లు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వై.భీమిరెడ్డి ఆధ్వర్యంలో వార్డు సభ్యురాలు ఆకుకూర వనజాక్షి, ఆకుకూర నాగరాజు అన్నదానం చేశారు.